



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం, ఆగస్టు 4, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## నేడు కాంగ్రెస్ చలో ఢిల్లీ



హైదరాబాద్ : బిసి రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తన ఈ పోరాటాన్ని మరింత ఉధృతపరచాలని సంకల్పించింది. ఇందులో భాగంగా బిల్లుకు ఆమోదం తెలపాలని కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు ఈ నెల 5, 6, 7 తేదీల్లో హస్తినలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది. కార్యకర్తల కోసం 4న (సోమవారం) చర్లపల్లి నుంచి హస్తినకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసింది. ఈ రైలులోనే కార్యకర్తలతో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులూ వెళ్ళనున్నారు. కాగా మీనాక్షి, మహేష్ కుమార్ గౌడ్ నాగ్‌పూర్ నుంచి విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. బిసిల ఓట్లు కొల్లగొట్టేందుకు బిసి బిల్లు, ఆర్డినెన్స్ పేరిట కాంగ్రెస్ డ్రామా చేస్తున్నదన్న విపక్షాల విమర్శలతో ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ ముఖ్య నాయకులంతా మరింత పట్టుదలగా సాధించేందుకు కృషి చేస్తున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు గత నెల 31న ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రంగారెడ్డి జిల్లా పరిగిలో పాదయాత్రకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర కొనసాగాల్సి ఉండగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా కార్యక్రమం ఉన్నందున ఈ పాదయాత్రకు సోమవారం స్మాల్ బ్రేక్ ఇవ్వనున్నారు.

### ఆందోళన కార్యక్రమం ఇలా..

4న చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రత్యేక రైలు హస్తినకు బయలుదేరనున్నది. ప్రతి జిల్లా పార్టీ అధ్యక్షుడు తప్పని సరిగా జిల్లా కమిటీతో సహకరించుకుంటూ ముఖ్యమైన ద్వితీయ శ్రేణి నాయకులను, కార్యకర్తలను వెంట తీసుకుని రావాల్సి ఉంది. ఇదిలాఉండగా ఈ రైలులో నాయకులు, కార్యకర్తలతో పాటు మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ కూడా వెళ్ళనున్నారు. అయితే మార్గమధ్యంలో నాగ్‌పూర్ వద్ద వారిరువురు విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో ఢిల్లీకి చేరుకుంటారు. 5న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నాలో పాల్గొంటారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ తదితరులు ఈ ధర్నాలో పాల్గొంటారు. ఢిల్లీ దద్ధరిల్లేలా మహా ధర్నా నిర్వహించాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచన. ఆ మర్నాడు 6న పార్లమెంటులో బిసి బిల్లుకు వాయిదా తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీలతో ప్రతిపాదించాలని, 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతి పత్రం సమర్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత పాదయాత్ర కొనసాగించాలని పిసిసి భావిస్తున్నది. అయితే పాద యాత్ర తేదీలను ఖరారు చేయలేదు.

### సాధించే వరకు విశ్రమించేది లేదు..

ఇదిలాఉండగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకూ విశ్రమించ రాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం తీసుకున్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ముఖ్యమంత్రి లోగడ చెప్పిన సంగతి తెలిసిందే. కాగా సెప్టెంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన పరిస్థితి

(మిగతా 2వ పేజీలో)





## కెసిఆర్ లేకుండా నల్గొండ లిల్లీపుట్ ఎవరు?

**ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే బిఆర్ఎస్ సోదరులు మాట్లాడలేదు**

**నాపై కుట్ర చేస్తుంది బిఆర్ఎస్‌లోని పెద్ద నాయకుడే**

**72 గంటల దీక్షకు ధర్నాకు అనుమతి రాకపోతే నా నివాసం నుంచైనా దీక్ష కొనసాగిస్తా**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత**

**నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు: కవితకు జగదీష్ కౌంటర్**

హైదరాబాద్ : బిఆర్ఎస్‌లోని పెద్ద నాయకులే తనపై అనుచిత వ్యాఖ్యలు చేసేలా ప్రోత్సహించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. అందుకే ఇంటి ఆడబిడ్డ మీద వ్యాఖ్యలు చేస్తే బిఆర్ఎస్ నాయకులు ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో ఒక్కటి మినహా అన్ని సీట్ల ఓటమికి కారణమైన లిల్లీపుడ్ నేత తన గురించి మాట్లాడుతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ లేకుండా ఆ లిల్లీపుడ్ ఎవరు? అని ప్రశ్నించారు. కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్‌లో ఉన్న ఏ నాయకుడైనా ఎవరు ప్రజలకు మనందరినీ పరిచయం చేసింది కెసిఆరే కదా..? అని అడిగారు. ఈ లిల్లీపుట్ నాయకుడు మాట్లాడగానే నిన్న మొన్న బిఆర్ఎస్ పార్టీలోకి వచ్చిన చిన్న పిల్లగాడు కూడా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు ఎవరు మీరు తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఏంది..? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వచ్చి పదవులు పొంది తన మీదనే మాట్లాడుతరా..? అని నిలదీశారు. బిజెపి ఎంపి సిఎం రమేష్ వ్యాఖ్యలకు, తన లేఖ లీక్ అయ్యేందుకు, బిఆర్ఎస్‌లోని ఇతర పరిణామాలకు సంబంధం ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. తనపైన వ్యాఖ్యల వెనక ఓ బిఆర్ఎస్ పెద్ద నాయకుడి హస్తం ఉందని, అందుకే బిఆర్ఎస్ నాయకులెవరూ స్పందించలేదని తాను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. ఆ కుట్ర చేసిన పెద్ద నాయకులు తన దగ్గర ఎవరో పది మందిని పెట్టి తన దగ్గర జరిగే అంశాల సమాచారం ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని చావు తెలివి తేటలు ప్రదర్శిస్తున్నారని, కానీ ఆ బాగా

(మిగతా 2వ పేజీలో)



**రాష్ట్రపతితో ప్రధాని, హోంమంత్రి భేటీ**

**రేవంత్ వ్యాఖ్యలకు రాజగోపాల్ కౌంటర్**





**ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన**

ఉపరితల ఆవర్తనంతో రెండ్రోజులు వర్షాలు

దక్షిణ కోస్తా, రాయలసీమ, తెలంగాణకు వర్ష సూచన

ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

### మెగా టెక్స్‌టైల్ పార్కుతో

## వేలకోట్ల పెట్టుబడులు

**ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి**

**చేనేత దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**చేనేత పరిశ్రమను జీడీపీలో 5 శాతానికి తీసుకెళ్లాలి**

**ప్రపంచంలో ఎక్కడ చూసినా మన ఉత్పత్తులే ఉండాలి**



మాదాపూర్ (హైదరాబాద్): దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఒకటి రాష్ట్రంలోని వరంగల్‌లో ఏర్పాటు కానుందని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతో వేల కోట్లలో పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. 2 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామం ఎత్నిక్ హాల్‌లో ఆదివారం నేషనల్ హ్యాండ్లూమ్ డే నిర్వహించారు. హైదరాబాద్ వీవర్స్ సర్వీస్ సెంటర్, హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కమిషనర్, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో

(మిగతా 2వ పేజీలో)



## లోకేశ్ మాటలు పట్టించుకోం: మంత్రి ఉత్తమ్

**ఏపీ ప్రతిపాదిత బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం**

**మా ఫిర్యాదుతోనే కేంద్రం ఆ ప్రాజెక్టును తిరస్కరించింది**

**రామగుండం ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్**

పెద్దపల్లి: 'నారా లోకేశ్ సహా ఏపీ మంత్రుల మాటలు పట్టించుకోం. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. అది తెలంగాణ నీటిహక్కుల ఉల్లంఘనే అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా ఫిర్యాదుతోనే బనకచర్లను కేంద్ర జలసంఘం తిరస్కరించింది. ఏపీ సీఎంతో జరిగిన సమావేశంలోనూ మేం బనకచర్లను వ్యతిరేకించాం'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుదిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఏపీ మంత్రుల మాటలను పట్టుకొని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్తానని కేసీఆర్ గతంలో అన్నారని ఆయన గుర్తుచేశారు. గోదావరిలో

(మిగతా 2వ పేజీలో)

## చుక్క నీటినీ వదులుకోం: భట్టి

ప్రతి ఎకరాకు నీరందేలా పకడ్బందీ కార్యాచరణ

పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ముదిగొండ: తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్‌దేనని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ కుట్రలను అడ్డుకుని తీరతామని అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల గోదాముల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములే రైతులకు అందుబాటులో ఉండేవని,

(మిగతా 2వ పేజీలో)





# గౌడ సంఘం నాయకుల కోలాహలం నడుమ పల్లె లక్ష్మణరావు గౌడ్ జన్మదిన వేడుకలు

## గౌడ సామాజిక వర్గం బలోపేతంకై కల్లుగీత వృత్తిదారుల అభివృద్ధి కోసం పోరాడుతున్న నిత్య కృషివలుడు

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : హైదరాబాద్ ఎస్ వి ఎస్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు, కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం బలోపేతంకై అనేక కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులను అధికారులను కలిసి, కల్లు గీత వృత్తిదారుల అభివృద్ధి కోసం, గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం, గీత పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని 1000 కోట్ల నిధులు కేటాయించాలని, గౌడ విద్యార్థులకు విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాలని, జనాభా ప్రతిపదికన గౌడ కులస్తులకు స్థానిక సంస్థల్లో చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని మంత్రులకు వినతి పత్రాలను అందిస్తూ అనేక ఉద్యమాలు చేపట్టిన నాయకుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ అని అన్నారు వారు ఆయురారోగ్యాలతో మరింత ఉత్సాహంతో గౌడ సామాజిక వర్గం బలోపేతంకై మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రామంతపూర్ గౌడ సంఘం అధ్యక్షులు సువ్వి భీష్మ గౌడ్, హైదరాబాద్ గౌడ సంఘం అధ్యక్షులు దేవేందర్ గౌడ్, సిద్దు గౌడ్ , ప్రశాంత్ గౌడ్,తెలంగాణ గౌడ సంఘం నాయకులు, వారి బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు



# రేవంత్ వ్యాఖ్యలకు రాజగోపాల్‌రెడ్డి కౌంటర్

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయం ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మళ్లీ కౌంటరిచ్చారు. ఇటీవల రేవంత్.. సోషల్ మీడియా జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా..'ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలే తప్ప అవమానించడం సబబు కాదు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదట్నుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉంది. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికీ విభజించి పాలించడమే. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదు' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై కొత్త చర్చ నడుస్తోంది. ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలే తప్ప అవమానించడం సబబు కాదు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదట్నుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉంది. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు నా మద్దతు%ా



### రేవంత్ వ్యాఖ్యలు..

ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..'జర్నలిజం డెఫినేషన్ మారిందని అన్నారు. సోషల్ మీడియా పేరుతో జర్నలిజంలోకి వస్తున్నా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను వేరే చేయాలని.. వాళ్లను వేరుగా కూర్చోబెట్టాలని పాత్రికేయులకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ రోజు మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఎవరు పడితే వాడు జర్నలిస్ట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారు. పెన్ను పేపర్ ఇస్తే ఏబీసీడీలు కూడా రాయలేని వారు కూడా నేను జర్నలిస్ట్‌ని అంటారన్నారు. ఏం జర్నలిస్ట్ అని అడిగితే సోషల్ మీడియా జర్నలిస్ట్ అంటున్నారు. వాడు ఎప్పుడైన జర్నలిజం స్కూల్‌లో చదివిండా? లేకపోతే ఓనమాలు మొత్తం అయినా వస్తాయా అంటే రెండూ రావు. రోడ్లమీద ఆవారాగా తిరిగేటోడు.. ఎక్కువ తిట్లొచ్చినోడు, ఏందంటే అదే మాట్లాడేటోడే జర్నలిజం అనే ముసుగు తొడుక్కొని అందరి పట్ల అసహ్యకరమైన భాషను ఉపయోగించే పరిస్థితులు వచ్చాయి. ఇలా జర్నలిజం ముసుగులో కొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టినప్పుడు ముందలి వరుసలో ధిక్కారంగా కూర్చుంటారు. మనమేదో లోకువ అయినట్టు, వాళ్లేదే పెత్తనాన్ని చెలాయించడానికి వచ్చినట్లు మన కళ్లలోకి చూస్తుంటారు. ఇంకా నన్ను చూసి నమస్కారం పెడతలేవు. నన్ను చేసి ఇంకా తల వంచుకుంటలేవు అని చూస్తుంటాడు. స్టేజీ దిగిపోయి చెంపలు పగులగొట్టాలని నాకు అనిపిస్తది. కానీ, పరిస్థితులు, హోదా అడ్డం వస్తుంది' అంటూ వ్యాఖ్యానించారు.

### రేవంత్‌కు కౌంటర్..

ఇక.. అంతకుముందు కూడా సీఎం రేవంత్‌కు రాజగోపాల్ రెడ్డి కౌంటర్ ఇచ్చిన విషయం తెలిసిందే. రాబోయే పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న రేవంత్ వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ..'రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి గారు ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# చుక్క నీటినీ వదులుకోం: భట్టి



తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలు నిర్మించామని తెలిపారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. దాని ఫలితంగానే దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు.

### సీఎం, ఉత్తమ్ వల్లే బనకచర్లకు బ్రేక్

ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయని భట్టి చెప్పారు. తెలంగాణలో పంటలు ఎండిపోయేలా ఏపీ అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడిందని చెప్పారు. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే పంటలకు నీరందుతోందని, బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కటి కూడా పనికొచ్చే ప్రాజెక్టు నిర్మించలేదని విమర్శించారు. రూ.లక్ష కోట్లు వెచ్చించిన కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు కూడా నీరందడం లేదన్నారు. నాడు పోలవరం నిర్మిస్తుంటే చోద్యం చూశారని, బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తోందని భట్టి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతితో ప్రధాని, హోంమంత్రి భేటీ

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వేర్వేరుగా భేటీ అయ్యారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఇరువురు నేతలు గంటల వ్యవధిలోనే రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అయితే భేటీకి కారణాలు, చర్చించిన అంశాల గురించి వివరాలు బయటికి తెలియలేదు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా.. రాష్ట్రపతిని ఆదివారం కలిశారని రాష్ట్రపతి భవన్ ఎక్స్ ఖాతాలో పేర్కొంది. పార్లమెంట్ సమావేశాలు, ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడు కాంగ్రెస్ చలో ఢిల్లీ

నెలకొంది. ఒకవైపు కోర్టు ఆదేశం, మరో వైపు ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరకుండా ఎన్నికలకు వెళితే ప్రతిపక్షాలకు విమర్శించేందుకు ఆయుధాన్ని అందించినట్లు అవుతుందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తున్నది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రతిపాదించి అన్ని పార్టీల సహకారంతో ఆమోదించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బిల్లును గవర్నర్‌కు పంపించడంతో, ఈ బిల్లు విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు సంబంధించింది కాబట్టి కేంద్రానికి పంపించారు. బిసి రిజర్వేషన్లపై కేంద్రం నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్నదన్న భావనతో రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్ తేవాలని భావించింది. ఈ మేరకు ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించగా, గవర్నర్ న్యాయ సలహా కోసం పంపించారు. బిసి రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్‌కు చట్టపరమైన చిక్కులు ఏమైనా ఎదురవుతాయా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాల్సిందిగా ఆ ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపించారు. ఇలా బిసిల రిజర్వేషన్లపై జాప్యం జరుగుతున్నదని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు హస్తిన బాట పట్టారు. బిసిలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలోగా రిజర్వేషన్లు సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు.

# మెగా టెక్స్‌టైల్ పార్కుతో వేలకోట్ల పెట్టుబడులు

కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించేది చేనేత రంగం. దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా ఈ రంగం కీలకపాత్ర పోషిస్తోంది. మన చేనేత ఉత్పత్తులు ఎంతో నాణ్యత, నైపుణ్యంతో తయారు చేసినవి. విదేశాల్లోని పలు విమానాశ్రయాలు, ప్రముఖ షాపింగ్ కాంప్లెక్స్‌లలో కూడా మన దేశానికి సంబందించిన, రాష్ట్రానికి సంబందించిన పట్టు చీరలు, చేనేత ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారు. సుమారు 5 కోట్ల మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అయితే కొన్ని కారణాల వల్ల చేనేత పరిశ్రమకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆయా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. తెలగాణలో పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట కాటన్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ తివాచీలకు జీఐ ట్యాగ్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చేనేత కార్మికులను మరింత ప్రోత్సహించి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలి. ప్రపంచ మార్కెట్‌లో మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో చేనేత పరిశ్రమ జీడీపీలో 2.3 శాతంగా ఉంది. దీనిని 5 శాతం వరకు తీసుకువెళ్ళాలి. ఇందుకు ప్రతి చేనేత కార్మికుడు పట్టుదలతో కృషి చేయాలి. నైపుణ్యం పెంచుకోవాలి. శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయి. అలా చేస్తే రానున్న రోజుల్లో ప్రపంచ దేశాల్లో ఎక్కడ చూసినా భారతదేశంలో తయారైన ఉత్పత్తులే అందుబాటులో ఉంటాయి..'అని కిషన్‌రెడ్డి చెప్పారు.

### చేనేత దుస్తులు ధరించాలి

'మన ఉత్పత్తులను బయటి దేశాలలో అమ్మకాలు చేస్తుంటే, కొందరు అక్కడ కొనుగోలు చేసి మన దేశానికి తెచ్చుకుంటున్నారు. అలా కాకుండా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వాడే ప్రతి వస్తువు మేడ్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అన్నట్టు ఉండాలి. ప్రతి కుటుంబం నెలకు వారం రోజులు చేనేత దుస్తులు ధరించాలి..'అని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న చింతకింది సుదర్శన్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. చేనేత కళాకారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. చేనేత మగ్గాలను, ఉత్పత్తులను తిలకించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు, నిఫ్ట్ డైరెక్టర్ మాలిని, డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లోకేశ్ మాటలు పట్టించుకోం: మంత్రి ఉత్తమ్

రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని తెలిపారు.

### తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని పునఃప్రారంభిస్తాం..

గత ప్రభుత్వం దోపిడీ కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డలో నీరు నిల్వ చేస్తే దిగువన ఉన్న 44 ఊళ్లు, భద్రాచలం వరదలో కొట్టుకుపోతాయని జాతీయ డ్యామ్‌ల భద్రత ప్రాధికార సంస్థ నివేదిక అందించిందని చెప్పారు. అందుకే మూడు బ్యారేజీల మరమ్మతులకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రూ. 38 వేల కోట్లతో ప్రాణహిత%-%చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం ఉపయోగంలో లేకపోయినా రికార్డుస్థాయిలో వరి పండిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ అందించిన నివేదికను కేబినెట్ ముందు పెడతామని.. దీనిపై అసెంబ్లీ చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. ఇచ్చంపల్లి వద్ద కూడా మరో ప్రాజెక్టు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయ రమణారావు తదితరులు పాల్గొన్నారు.



## ఆరుట్ల వెంకటేష్ యాదవ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బిజెపి నాయకులు

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 03( వార్త మిర్రర్ ) నారాయణపురం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులు ఆరుట్ల వెంకటేశ్ యాదవ్ గారు ఇటీవల మరణించడంతో వారి పిల్లల భవిష్యత్తు నిమిత్తం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా%శ్రీశ్రీ% గంగిడి మనోహర్ రెడ్డి ?50,000/- రూపాయల చెక్కును బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి,మండల శాఖ అధ్యక్షులు సుర్విరాజు గౌడ్ ద్వారా అందజేయడం జరిగింది దానితోపాటు మండల శాఖ నుండి ?30,000/- రూపాయలు చిమిర్యాల గ్రామ శాఖ నుండి ?70,500/- రూపాయలతో కలిపి మొత్తం ?1,50,500/- రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా వీరారెడ్డి గారు మాట్లాడుతూ వెంకటేష్ మరణం వారి కుటుంబంతో పాటుగా భారతీయ జనతా పార్టీకి తీరని లోటని,భవిష్యత్తులో వారి కుటుంబానికి పార్టీ అండదండగా ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో చిమిర్యాల మాజీ సర్పంచ్ గడ్డం స్వామి మండల ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేశం గౌడ్, సంపతి సుధాకర్ రెడ్డి,బూత్ అధ్యక్షులు బోడ శివకుమార్,కేశాని యాదయ్య,దండుగల నాగేష్,సుర్కంటి నర్సిరెడ్డి సుర్కంటి రవీందర్ రెడ్డి,ఎల్కరాజు శ్రీను,సుర్వి కుమార్,చెరుకు గణేష్,చెరుకు కిరణ్,చిన్ని సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## బీసీలను చైతన్యం చేయడమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యం

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 03 ( వార్త మిర్రర్)బీసీలను చైతన్యం చేయడమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి స్థాపించబడిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్ అన్నారు, మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండలంలో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకుడు కటకం నర్సింగ్ రావు ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన మన ఆలోచన సమితి జెండా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 350 గ్రామాలు 37 నియోజకవర్గ లలో ఈ జెండాలు ఎగురవేయడం జరిగింది.అందులో భాగంగా నారాయణపురం మండలం లో 11 గ్రామాల్లో కూడా ఎగురవేయడం జరిగిందన్నారు.రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బీసీల ఐక్యత కోసం ఈ సంస్థ పోరాడుతుందని పేర్కొన్నారు. బీసీల జాతి సంపదను ఆర్థిక వనరులను చట్టసభల్లో వాటాను ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తూ రాజకీయ రాజ్యాధికారం సాధించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉప్పల వెంకటేష్ శికిల మెట్ల ప్రభాకర్ కొప్పు రామకృష్ణ,బైకని నరేందర్ యాదవ్,రాసమల్ల సంపత్,సంజయ్,బద్దం సాయికిరణ్, నాతి లక్ష్మణ్, కైసర్, నాతి రాజు, వావిళ్ళ శ్రీకాంత్, మెరుగు పురుషోత్తం వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## తదియ పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 3

ఆదివారం (భానువాసరే ) శ్రావణ మాసం, శుక్ల పక్షం, నవమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ. సూర్య భగవానుని విశిష్టత :ఆదివారం %-% సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, ఆర్గనైసింగ్ సెక్రటరీ వోడ్నాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు నాయిని విద్యాసాగర్ రావు, ధర్మకర్తలు భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, రమేష్, ఉమాపతి, రాజేష్, అర్చకులు నాగరాజు,తదితర భక్తులు, మాతలు పాల్గొన్నారు.



## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం:

కల్వకుర్తి ఆగస్టు 3 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన సేవకుల బాలయ్య అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కల్వన కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎండీ ఖాజ,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, నాయకులు ఏకంబరం,శేఖర్, శంకర్, రామస్వామి, సాదిక్, జంగయ్య గారు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా పద్మశాలి ఎన్నికలు

### అధ్యక్షులుగా భోగ రాజేశం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 3: స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఎన్నికలు ఆదివారం పద్మశాలి సేవా సంఘం కళ్యాణ మండపంలో జరిగాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్ష బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. గత పది రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్ల ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అభ్యర్థులు అధిక ఓట్లు సంపాదించాలని ఓటర్లను ప్రసన్నం చేసేందుకు ప్రచారం చేస్తూ ఎన్నికల రోజైన ఆదివారం వృద్ధులు, వికలాంగులను ఆటోలపై తరలించి ఓటు హక్కును వినియోగింప చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద బరిలో నిలిచిన అభ్యర్థులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించాయి. పద్మశాలి సంఘం ఎన్నికల అధ్యక్ష బరిలో భోగ రాజేశం, గాజంగి అశోక్, ప్రధాన కార్యదర్శి బరిలో మామిడాల లక్ష్మీనారాయణ, కడకుంట్ల నరేష్, కోశాధికారిగా బరిలో ఆడెపు నరసయ్య, కడకుంట్ల ప్రభాకర్, సామల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా దాసరి గంగాధర్, మామిడాల రాజేందర్, మిట్టపెల్లి జగదీశ్వర్, శ్రీపతి లక్ష్మీనారాయణ నిలిచారు. కాగా హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా భోగ రాజేశం, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేష్, కోశాధికారిగా



ఆడెపు నర్సయ్య, ఉపాధ్యక్షులు దాసరి గంగాధర్ లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు గా దాసరి రామస్వామి, ఎలిగేటి రాజ్ కిషోర్, సింగని రామదాస్, గాజంగి రాజేశం, భూమేశ్వర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహబంధం అనేది జీవితానికి నిలువెత్తు ఉదాహరణ

### వాసరి రవి

### రాయికల్ ప్రెస్ క్లబ్ జేపసీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు.

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 3 : జగిత్యాల జిల్లా రాయికల్ ప్రెస్ క్లబ్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పరస్పరం ఫ్రెండ్‌షిప్ బాండ్స్ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి మాట్లాడుతూ, “స్నేహబంధం అనేది జీవితానికి నిలువెత్తు ఉదాహరణ. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి స్నేహితులు అవసరం. మంచి స్నేహితుడు ఉండటం ఒక్కటే జీవితాన్ని మారుస్తుంది,” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి, చింతకుంట సాయికుమార్, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, సీనియర్ పాత్రికేయులు సింగిడి శంకరయ్య, తిరుమల శంకర్, వాసం లింబాద్రి, బొంగోని శ్రీనివాస్, శ్యాంసుందర్, మామిడిపల్లి లక్ష్మణ్, కల్లెం శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ సభ్యులు తీగుళ్ల గోపాల్ రెడ్డి, రసూల్, గన్నవరం గంగాధర్, ఇమ్మడి విజయ్, గంట్యాల ప్రవీణ్



కుమార్, రషీద్, ఉరుమడ్ల సంజీవ్, గట్టుపెల్లి నరేష్ కుమార్, రమాపతి రావు, షాకీర్ పాల్గొన్నారు.

## సర్వాంతర్యామిగా మారిన డ్రోన్.. పురుగుమందుల పిచికారితో వ్యవసాయంలో కొత్త ఒరవడి.

వార్త మిర్రర్ మల్యాల ప్రతినిధి (ఆగష్టు 3): డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. విత్తనాలు చల్లుకోవడం నుంచి ఎరువులు, పురుగు మందులు వేయుడం, పంటల అంచనా, పంటలకు అందించాల్సిన పోషకాలు అందించడంతో పాటు పలు అంశాల్లో ఈ టెక్నాలజీ ప్రయోజనకారిగా మారింది. రానున్న రోజుల్లో చిన్నపాటి డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి జరుగుతోందని స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు..డ్రోన్.. ఇందు గలదు అందులేదు అన్న సందేహం లేదు.. ఎందెందు వెతికినా అందదు కలదు. అవును ఇప్పుడు గాల్లో చక్కర్లు కొట్టేందుకు ఇక్కడ అక్కడ అన్న తేడా లేదంటూ దూసుకుపోతోంది. పెళ్లిళ్లకు మాత్రమే పరిమితం అయిన డ్రోన్లు.. నా రూటే సపరేట్ అంటూ.. బహిరంగ సభలు, నాయకుల పాదయాత్రలతో మరింత వేగం పెంచింది.. అక్కడితో ఆగిపోతే అది డ్రోన్ ఎందుకు అవుతుంది.. తాజాగా సరిహద్దులు దాటి సైనికుల రంగంలోకి దిగింది. జవాన్ కోసం మాత్రమే కాదు తాజాగా జై కిసాన్ అంటూ నినదిస్తోంది. పంటల సాగుకు తోడ్పడుతూ.. మందుల పిచికారికి నేనుసైతం అంటూ అన్నదాతకు అండగా నిలుస్తోంది డ్రోన్..మల్యాల మండలం మద్దుట్ల గ్రామంలోని కట్ట మల్లారెడ్డి,పత్తిపాక రాజశేఖర్ అనే రైతులు వారికి ఉన్న పసుపు,మొక్కజొన్న మరియు పత్తి పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తూ భళా అనిపిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. డ్రోన్ వాడడం వల్ల ఎకరానికి 450 రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుందని,దీనితో సమయం ఆదాతో పాటు కూలీల కొరత తీరుతుందని రైతులు తెలిపారు..

### స్మార్ట్ వర్క్ నీట్ వర్క్.. సెల్ ఫోన్ కంటే ఇస్మార్ట్ గా..

కూలీల కొరత తీవ్రమవటం, ఎరువులు, పురుగు మందు ధరలు పెరిగిపోవటం వల్ల



నష్టపోతున్న రైతులకు ఈ డ్రోన్ ఊరట కల్పించడమే కాకుండా యువతరాన్ని రాబోయే కాలంలో వ్యవసాయం వైపు మరల్చడానికి ఈ టెక్నాలజీ దోహదం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.చూడాలి రాబోయో డిజిటల్ మాయ ప్రపంచంలో డ్రోన్ లు ఇంకెంత దూకుడుతో దూసుకెళుతాయో.. ఇంకెన్ని విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతాయో.

## చిమిర్యాల గ్రామంలో బిజెపి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 03 ( వార్త మిర్రర్ ): నారాయణపూర్ మండల కేంద్రంలోని చిమిర్యాల రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఇంటింటికీ బిజెపి,ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు,అనే కార్యక్రమంలో భాగంగా చిమిర్యాల భూత్ అధ్యక్షుడు బోడ శివకుమార్ ఆధ్వర్యంలో బూత్ సమావేశం నిర్వహించడం జరిగింది తధనంతరం చిమిర్యాల గ్రామంలోని గడప గడపకు తిరుగుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దోనూరు వీరారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు కానీ ఆరు గ్యారంటీ లతో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిట్ట నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి అభ్యర్థులకు మద్దతు తెలియజేస్తూ ప్రజల చేత 9240015366 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇప్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్,చిమిర్యాల మాజీ సర్పంచ్ గడ్డం స్వామి మండల ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేశం గౌడ్, సంపతి సుధాకర్ రెడ్డి,బూత్ అధ్యక్షులు బోడ శివకుమార్,కేశాని యాదయ్య,దండుగల నాగేష్,సుర్కంటి నర్సిరెడ్డి సుర్కంటి రవీందర్ రెడ్డి,ఎల్కరాజు శ్రీను,సుర్వి కుమార్,చెరుకు గణేష్,చెరుకు కిరణ్,చిన్ని సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## మహిళల పథకాలను వెంటనే అమలు చేయాలని మహిళా రైతు కూలీలతో పొలంలో సిపిఐ నిరసన

మిర్యాలగూడ/దామరచర్ల, ఆగస్టు 3:-( వార్త మిర్రర్) : కేంద్ర ప్రభుత్వం ఒక వైపు నిత్యావసరాల ధరలు పెంచుకుంటూ పోతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆత్మీయ భరోసా మహాలక్ష్మి పథకాలు అమలు చేయకపోవడం వల్ల పేదలు పేదలుగానే ఉంటున్నారని దామరచర్ల మండల సిపిఐ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామ మహిళ రైతు కూలీలతో కలిసి కేంద్ర ప్రభుత్వం నిత్యవసరాల దరలు తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా మహాలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేయాలని పొలంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో మతం పేరు చెప్పుకుని మూడోసారి అధికారంలో వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులను పెంచి పోషిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలోనే 80 శాతం పైన ఉన్న పేద బడుగు బలహీన వర్గాలను వారి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని సిపిఐ కార్యదర్శి ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. ఏది ఏమైనా వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరాలని లేని పక్షంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడ్తామని ఉదయ్ కుమార్ హెచ్చరించారు. ఆత్మీయ భరోసా మహాలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేసి పేదల ఖాతాలో డబ్బులు జమ చేయాలని సిపిఐ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధనావత్ బుజ్జి లలిత మంగ్లీ జూబ్లీ తమిళి రాణి సుధా సావిత్రి నాగమ్మ రాములమ్మ నాగమణి మమత ఉన్నారు.



## ఘనంగా సుకుమార్ జయంతి వేడుకలు.



కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 3.జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీ కి చెందిన ఉయ్యాల సుకుమార్ జయంతి వేడుకలు పట్టణంలోని అంబేద్కర్ నగర్లో గల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు పలుకలు ,నోట్ బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుకుమార్ చిన్న వయసులోనే అనేక సేవా కార్యక్రమాలు చేశాడని ఆయన సేవలను కొనియాడారు. ఆయన మరణం తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల నరసయ్య, ప్రముఖ వైద్యులు రేగొండ రాజేష్, నేటి ఉదయం ఎడిటర్ బలిజ రాజారెడ్డి, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు వనతడుపుల మురళి, ప్రకాష్ గిన్నెల శ్రీకాంత్, రేగొండ శిరీష్, ఉయ్యాల శోభన్, కండ్లే మైకల్, ఉయ్యాల శేఖర్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రావు , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, సుకుమార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడి టీచర్స్ కు18,000ల గౌరవ వేతనం చెల్లించాలి

మిర్యాలగూడ ఆగస్టు 31:- (వార్త మిర్రర్) అంగన్వాడీ టీచర్స్ ను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఐఎన్టీయు జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య కోరారు. ఆదివారం స్థానిక ఎన్ఎస్పి క్యాంపు యుపిఎస్ లో ఇందిర ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్టీయుసి) మిర్యాలగూడ ఐసీడిఎస్ ప్రాజెక్టు యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రేట్యూటీ చెల్లించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలో చేర్చుకుంటున్నారని అడ్డుకోవాలని సోమయ్య కోరారు. మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం టీచర్ కు రూ. 18,000లు గౌరవ వేతనం చెల్లించాలని ఐఎన్టీయుసి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎండి.మొయినుద్దీన్ కోరారు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్ కు రూ. 2లక్షలు, ఆయాకు లక్ష రూపాయలివ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 65 నుండి 60కు తగ్గించాలని కోరారు. సర్వీస్ ఆధారంగా టీచర్లకు సూపెర్వైసర్ పదోన్నతి కల్పించాలని కోరారు. ఐఎన్టీయుసి చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పరికే వెంకటేశ్వర్లు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూలకంటి మల్లీశ్వరి, విజయ, నాగమణి, పద్మావతి, రాజేశ్వరి, గౌసియా, రేష్మ, లక్ష్మిబాయి, మాధవి సరళ, చంద్రకళలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్నేహితుల దినోత్సవం

మిర్యాలగూడ, ఆగస్టు 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ తో కలసి స్నేహితుల దినోత్సవ బ్యాండ్స్ కట్టుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, గిరిధర్, జలందర్రెడ్డి, షేక్ జవెద్, రుణాల్ రెడ్డి, ఎండి. మొయిజ్,రమేష్ నాయక్, చల్ల వెంకన్న, బంటు లక్ష్మీనారాయణ, పొదిల వెంకన్న, ఉబ్బపల్లి కాశయ్య, జి.జానకిరాంరెడ్డి పాల్గొన్నారు.



### ఏడు కాలనీలలో వర్షపు

### నీటి నాళాలో మూడు నెలలుగా ప్రవహిస్తున్న కెమికల్, డ్రైనేజీ నీరు

**- సమస్య పరిష్కారం చేయాలని ఆందోళన చేసి ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు వినతిపత్రం అందజేసిన కాలనీ వాసులు**

ఎల్బీనగర్,3 ఆగస్టు: నాగోల్, మన్సురాబాద్ డివిజన్ల పరిధిలోని సెవెన్ హిల్స్ కాలనీ, స్వాతి గార్డెన్, ద్వారకానగర్, హిమపురి కాలనీ, డి. పి నగర్, సౌత్ ఎండ్ పార్క్ కాలనీలకు చెందిన కాలనీసంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు సమావేశమయ్యారు. ఆదివారం సమావేశమై రెయిన్ నాలలో గత మూడు నెలలుగా ప్రవహిస్తున్న కెమికల్, డ్రైనేజ్ వాటర్ సమస్య పరిష్కారం చేయాలని కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. మరుగు నీరు, కెమికల్ వాటర్ ప్రవాహం కారణంగా ఏడు కాలనీల ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతూ అనేక రోగాల బారిన పడుతూ చర్మ సంబంధించిన శ్వాస కోశ సంబంధించిన వ్యాధులు బారిన పడుతున్నామని ఆందోళన చెందారు. తమ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ సమస్య ని సత్వరమే పరిష్కారం చేయాలని నియోజకవర్గం ఎమ్మెల్యే సుధీరెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ల కి వినతిపత్రం అందజేసినట్లు వారు వెల్లడించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఏడు కాలనీలకు చెందిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గం సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. సెవెన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ గడ్డి అన్నారు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కత్తుల రాంబాబు, శోభన్, ప్రవీణ్, మధు, చంద్రశేఖర్ గౌడ్, నరేందర్ రెడ్డి, అజయ్, కిషోర్, రమేష్, జయరాం, దయాకర్, సైదులు, రాంప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పేదింటి ఆడ బిడ్డ వివాహానికి రాధాకృష్ణ ట్రస్ట్ ఆర్థిక సాయం

**- కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్**

కల్వకుర్తి ఆగస్టు 3 వార్త మిర్రర్ ప్రతినిధి:- పేదింటి వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ కొండంత భరోసానిస్తుంది. ట్రస్ట్ అధినేత మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ పేదింటి ఆడపిల్ల వివాహానికి మేనమామ కట్నం కింద రూ”21000 రూపాయిల ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందిస్తున్నారు. తాజాగా ఆదివారం కడ్తాల్ మండలలోని గానుగమర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాకు చెందిన నెనావత్ దేవి కిషన్ దంపతుల కుమార్తె మీనా వివాహానికి 21000 ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను ట్రస్ట్ చైర్మెన్ దశరథ్ నాయక్ చేతుల మీదుగా అందించారు. దానికి తోడు మీనా వివాహానికి గ్రామపంచాయతీ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ 5000, డైరెక్టర్ సేవ్య 5000 , మాజీ ఉపసర్పంచ్ శారద పాండు 25000, శ్రీను 10000 ,లక్ష్మణ్ 10000 శ్రీను 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించగా అలాగే రేఖ్య తండ గ్రామపంచాయతీ పరిధిలోని టాక్ రాజ్ గూడ గ్రామపంచాయతీకి చెందిన వడ్త్యావత్ అనిత దేవుల దంపతుల కుమార్తె నిహారిక వివాహానికి ట్రస్టు ద్వారా 21000 వేల రూపాయలతో పాటు మేనమామ కన్నం కింద పట్టుచీరను కానుకగా అందించారు. కోట్య 10000 నిహారిక కు ఇచ్చారు



కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ సులోచన సాయిలు మాజీ ఎంపీటీసీలు ప్రియా రమేష్ మంజుల చంద్రమౌళి మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ జగన్ నాయకులు రాములు నాయక్ ధర్మ కృష్ణయ్య శ్రీనివాస్ గౌడ్ సత్యనారాయణ చందు పాండు రాజు శ్రీకాంత్ మహేష్ చందర్ రాజేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు జూటా..మోసం కాంగ్రెస్ నైజం

**- కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్**

కల్వకుర్తి ఆగస్టు 3 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఆరు గ్యారంటీలు వట్టి జూటా మాటలని, ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ నైజమమని అన్నారు. కల్వకుర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్ ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆఫీసు కల్వకుర్తిలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 6 గ్యారెంటీలు 420 హామీల పేరుతో తెలంగాణ ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఏ ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు చేయలేదు ప్రజల దృష్టి మరల్చడానికి రోజుకొక కొత్త సమస్యను సృష్టించి తాత్సరం చేస్తూ మొద్దు నిద్రలో ఈరాష్ట్రాన్ని పాలిస్తుంది ప్రజలను మభ్యపెడుతున్న సంగతి ప్రజలు గమనించారు కాబట్టి త్వరలోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి భూస్థాపితం తప్పదని అన్నారు.కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా రాబోయే కాలంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని అందులో భాగంగా మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి ముఖ్యఅతిథిగా ఈనెల 6వ తారీకు బుధవారం ఉదయం 10 గంటలకు పాలమూరు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం నుంచి అర్హులైన లబ్ధిదారులతో శివాజీ చౌక్ వరకు భారీ ర్యాలీ ఉంటుంది తదనంతరం బహిరంగ సభ ఉంటుంది. కావున పట్టణ మరియు మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయగలరని కోరుతున్నాము




అని తెలియజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ బండెల రామచంద్రారెడ్డి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్ బిజెపి సీనియర్ నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి,నీరు కంటి రాఘవేందర్ గౌడ్,నరెడ్ల శేఖర్ రెడ్డి, బోడ నరసింహ, పెద్దారి విజయ్,చందు ముదిరాజ్, రహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర్లు రాజకీయాల్లోకి రావాలి

**దరిపల్లి ప్రవీణ్ కుమార్ శాలివాహన కుమ్మరి**

ప్రత్యేక ప్రతినిధి( వార్తా మిర్రర్ ) ఆగస్టు03: కుమ్మరి సంఘం మోత్కూరు మండల అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మరి సంఘం కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ శాలివాహన కుమ్మర్లు రాజకీయాల్లోకి రావాలని మన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఎమ్మెల్యే గానీ , ఒక్క ఎంపీ గాని లేరని మన శాలివాహన కుమ్మర్లు ముందుకు రావాలని చట్టసభల్లో మనవాణి వినిపించాలనిమన హక్కుల సాధనకు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈరోజు మోత్కూరు మండల కేంద్రంలోని పోతాయిగడ్డలో మోత్కూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ కో కన్వీనర్ ఓరుగంటి గోపాల్ యాదాద్రి భువనగిరి జిల్లా సభ్యులు తాడూరి ఆంజనేయులు డీసీఎం, చిన్నగారి బలరాం, చిన్నగారి కృష్ణ, గుమ్మిడేల్లి భాస్కర్ సమక్షంలో కన్వీనర్ గా మారుపాక బిక్షపతి కో కన్వీనర్ గా నరుకుడు బిండెల శ్రీనివాస్ తో పాటు సభ్యులుగా నేర్లకంటి మస్యగిరి, నిలుగొండ కృష్ణ, మారుపాక పవన్ కుమార్,చేతరాజు వీరస్వామి, చంద్రయ్య చంద్రయ్య, మారుపాక శేఖర్లను అన్ని గ్రామాల కుమ్మర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోత్కూరు అడహాక్ కమిటీ కన్వీనర్ మారుపాక బిక్షపతి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు సంఘాన్ని బలోపేతం చేస్తానికి నా



వంతు కృషి తప్పకుండా చేస్తానని అన్నారు. ఈ కమిటీకి హాజరైనవారిలో శాతరాశి వీరస్వామి, నిలిగొండ అశోక్ నిలిగొండ కృష్ణ, శాతరాశి అంజయ్య, నిడిగొండ కృష్ణ, శాతరాశి చంద్రయ్య, నేర్లకంటి మచ్చ గిరి, మారుపాక వెంకటేష్, పోలేపల్లి అంజయ్య, నిలిగొండ అశోక్ మోత్కూరు మండల కన్వీనర్ మారుపాక బిక్షపతి, రామన్నపేట కన్వీనర్ బొడ్డుపల్లి సైదులు, ఆత్మకూరు మండలం కొత్తపల్లి గోవర్ధన్,ఈ సమావేశానికి మోత్కూరు మండల పరిధిలోని గ్రామాల కుమ్మర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

మిర్యాలగూడ ఆగస్టు 3:-( వార్త మిర్రర్) ఠర్యాలగూడ ఏరియా హాస్పిటల్ ఆటో అడ్డా యూనియన్ ఏరియా హాస్పిటల్ ఆటో డ్రైవర్లు, ఓనర్లు, బిఆర్టియు మిర్యాలగూడ పట్టణ కమిటీ వారి పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. తెలంగాణ ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నాజర్ అలీ మీర్జా, సారధ్యంలో నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ పర్వేస్, మిర్యాలగూడ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ చోటు, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అఖిల్, హౌసింగ్ బోర్డ్ ఇన్చార్జ్ బంటు శేఖర్, మాజీ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ మహమూద్ సమక్షంలో మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాల ఆటో అడ్డ ఎన్నికల పోటీలో నిలిచిన అభ్యర్థులు మాజీ అధ్యక్షుడు ఇరిగి కృష్ణ డి.చందు నాయక్ మధ్యన ఎన్నికలను నిర్వహించారు. ఇట్టి ఎన్నికలలో మొత్తం 33 ఓట్లకు గాను 13 ఓట్లు ఇరిగి కృష్ణ కి 20 ఓట్లు డి చందు కి రాగా ఏడు ఓట్ల మెజార్టీతో డి చందు, నూతన అధ్యక్షునిగా నియమించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మొహమ్మద్ సోహెల్ , ఉపాధ్యక్షులు గా ఇరిగి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఏం సైదా, సహా కార్యదర్శిగా ఎల్ పెంటయ్య, కోశాధికారిగా మొహమ్మద్ హలీం, కార్యవర్గ సభ్యులుగా ఎన్ శ్రీను, లక్ష్మయ్య, రమేష్, రఫీ, నాగ నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాజర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ పాటించవలసిన నియమ నిబంధనలు గురించి నూతన కమిటీకి అవగాహన కల్పిస్తూ, డ్రైవర్ గుర్తింపు వేసుకునే యూనిఫామ్ ఖాకి చొక్కాను ధరించినప్పుడే గుర్తింపు ఉంటుంది కావున ప్రతి ఒక్కరు ఖాకిచొక్క ధరించాలి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి, మరియు బండి కాగితాలన్నీ ఫోర్సులో ఉంచుకోవాలి, రోడ్డుపైన రహదారుల వెంట మనకు నిర్మించినటువంటి



మార్జిన్లోనే ఆటోలను నిలపాలి, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ అటు ప్రజలకు ఇటు పోలీసు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్యాసింజర్ల పట్ల వినమ్రంగా ప్రవర్తించాలి అధిక చార్జీలు వసూలు చేయకూడదన్నారు. కమిటీ సభ్యులు నిర్ణయించిన చార్జీలను మాత్రమే తీసుకోవాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు కలిసికట్టుగా ఏకమై పోరాడి సమస్యను సమర్ధ వంతంగా సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కమిటీ వారు ఎదుర్కో లేనటువంటి సమస్యలను పట్టణ, జిల్లా, రాష్ట్రస్థాయి దృష్టికి తీసుకువస్తే ఏ స్థాయిలోనైనా పోరాడి సమస్యను కచ్చితంగా పరిష్కరించి మీకు న్యాయం చేస్తామని వివరించారు.

# ప్రైవేటు ఆస్పత్రుల ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

**ఎమ్మెల్యే బిఎల్ఆర్**

మిర్యాలగూడ , ఆగస్టు 3:-( వార్త మిర్రర్) పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓజోన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సతీమణి మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఎల్ఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజల కోసం మెరుగైన విద్య వైద్యం అందించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని, తన కృషిలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు రైస్ మిల్లర్స్ పలువురు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించటం శు భసూచకం అన్నారు. శిబిరంలో రోగులకు జనరల్, ఆర్థో, న్యూరో, కార్డియాలజీ, ఆప్తమాలజీ, ఈసీజీ, టూడి ఈకో, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ భరత్ కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సురేష్ గుడే, న్యూరో సర్జన్ డాక్టర్ నిఖిల్ దేశ్ ముఖ్, ఆర్థోపెడిక్ డాక్టర్ కళ్యాణ్, గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డిలు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్స్ మధుసూదన్ రెడ్డి, రవీందర్ రెడ్డిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, గోదాల



జానకిరామ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎండి.జానీ క్రికెటర్, కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## రెజ్లింగ్ పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించిన ధ్రువన్ సత్యవర్మ కు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సన్మానం..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :కొండాపూర్ కు చెందిన ధ్రువన్ సత్య వర్మ అండర్ 11 రెజ్లింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. అండర్ 11 రెస్లింగ్ పోటీలను ఛత్తీస్ ఘడ్ లో నిర్వ హించినట్లు ధ్రువం సత్య వర్మ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం ధ్రువన్ సత్య వర్మను తన నివాసంలో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరిక పూడి గాంధీ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సాహం ఇవ్వాలని తల్లిదండ్రులకు చెప్పారు ఇలానే మన దేశానికి మంచి పేరు తేవాలని భవిష్యత్తులో ఇంకా అనేక రకాల రంగాలలో ధ్రువం సత్య వర్మ విజయం సాధించాలని ఆశీర్వదించారు. ధ్రువన్ సత్య వర్మ తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు జె.బలరామ్ యాదవ్, రాజమోహన్ రావు, రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అలరించినా వారంతాపూ సాంస్కృతిక కార్యక్రమాలు...

మాదాపూర్ వార్త మిర్రర్ :మాదాపూర్ లో ని శిల్పారామం లో యంపీ థియేటర్ లో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిశ్శృంఖలా డాన్స్ అకాడమీ శ్రీమతి సంధ్య రాజు శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది రామ రామ, ఎలమంచ, డోలాయంచాల, భావములోన, మాతే మలయధ్వజ , భాగ్యదా లక్ష్మి, రామచంద్రయ్య, హరివారసనం, స్వాగతం కృష్ణ, కలియనర్తనం, కాలభైరవాష్టకం, శివ శంభో, దశావతారం, అంశాలను అధ్య, చేతన, భాగ్యలక్ష్మి, హాసిని, నందిని, శ్రీయ, ఖ్యాతి, జోస్య, వాసుకి, నియతి, లక్ష్మినైనికా, గౌతమ్ సర్వాణి, వైనవి మొదలైన వారు శ్రీ వెంకట్ గంగాధర్, మేఘ, మనీష, లక్ష్మి, ధన ఆధ్వర్యం లో ప్రదర్శించారు.




## ఎం.ఎ నగర్ పోచమ్మ తల్లీ ఆలయ కమిటీ ఆధ్వర్యం లో అన్నదానం..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మియాపూర్ డివిజన్ పరిధిలో ని ముజఫర్ అహ్మద్ నగర్ కాలనీ ఆదివారం నాడు శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ సభ్యుల అద్వర్యంలో అమ్మ వారి ఆలయం వద్ద అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. శివ సత్తులు రాకేష్, దుర్గయ్య లను దేవాలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.అనిల్ కుమార్, పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు దూలం రాజు గౌడ్, జెనరల్ సెక్రటరీ దేవేందర్, కమిటీ సభ్యులు వెల్డింగ్ రాజు, పి.రాజు, మధు, పవన్ నేత, మల్లేష్, చాకలి రాములు, మోహన్, డప్పు రాములు, బండి రామకృష్ణ గౌడ్, కాలనీ మహిళలు నర్సమ్మ, కే. లక్ష్మీ, యశోద, రాధిక, సుగుణ, జి. లక్ష్మీ, మొగలమ్మ, డి. సుజాత, డి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## జాతి మత పేద ధనిక తారతమ్యం లేకుండా సమయస్ఫూర్తితో సాగేది స్నేహం!

### జీవితంలో స్నేహ అనుబంధం అనేది చాలా ముఖ్యం.. గణేష్ సాగర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : మంచి హితుడు స్నేహితుడు అవుతాడు, నిత్యం స్నేహిడి గురించి ఆలోచించి, వాడి కష్టనష్టాలను, వాడి సుఖాలను, వాడి నడవడిక, వారి శు భకార్యాల్లో, ఆశుభకార్యాల్లో అంతా నేనే అంటూ తిరిగేవాడే అసలైన స్నేహితుడు,స్నేహితుల దినోత్సవం సందర్భంగా మా ఆప్తమిత్రులతో కలవడం గోలి సోడా తాగడం జరిగింది, వీరిలో సాగర్ కనెక్షన్ బిల్డర్ సూధం శేఖర్ సాగర్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్, కల్లెట్ల నర్సింగ్ సాగర్, నల్లగొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏలే భాస్కర్, అక్కనపల్లి వీరయ్య, వీరంతా అంతా మా కుటుంబం అని కలిసి మెలిసి ఉండే నిజమైన స్నేహితులు

## రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపు.



కోరుట్ల, వార్త మిర్రర్ ప్రతినిధి ఆగష్టు 3.కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డు వెంట రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించినట్లు ఏడి రఘుపతి తెలిపారు 65 సంవత్సరాలగా రోడ్డు మధ్యలో ఉండి ప్రజలను ఇబ్బందుల గురి చేస్తున్న విద్యుత్ స్తంభం తొలగింపు పై అనేక ఫిర్యాదులు వచ్చిన క్రమంలో దాన్ని తొలగించి ఆస్థానంలో వేరేచోట విద్యుత్ సామాన్ ఏర్పాటు చేసి గతంలో ఉన్న 33 కెవి లైన్ నుంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు. ఏడీ రఘుపతి తెలిపారు.



## జైనపల్లి గ్రామ బోనాల మహోత్సవానికి డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు ఆహ్వాన పత్రిక అందజేత

### సంస్కృతి సాంప్రదాయాలతో గ్రామ నిబంధనలతో ఘనంగా నిర్వహించాలి: డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలో జరిగే బోనాల మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందించారు జైనపల్లి గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి సాంప్రదాయానికి బోనాల పండుగ ప్రతీక అన్నారు. సంస్కృతి సాంప్రదాయాలతో గ్రామ కట్టుబాటులతో ఘనంగా నిర్వహించాలని తెలిపారు మీ గ్రామ బోనాలకు హాజరవుతాన ని తెలిపారు



## పసిడి తనఖా రుణాలకు కొత్త నిబంధనలు కంపెనీలపై ప్రభావమెంత?

దిల్లీ: పసిడి తనఖా రుణాల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఇటీవల తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల, ఆర్థిక సంస్థలు తమ వ్యాపార నమూనాలను సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ చెబుతోంది. కార్యకలాపాల సామర్థ్యం, సేవల తీరు ఆయా సంస్థల మధ్య అంతరానికి కీలకంగా మారనున్నాయని పేర్కొంది. రూ.2.5 లక్షల్లోపు పసిడి రుణాలకు తాకట్టు పెట్టే పసిడి విలువలో 75 శాతంగా ఉన్న రుణ నిష్పత్తి (ఎల్‌టీవీ)ని 85 శాతానికి పెంచుతున్నట్లు ఈ నెల మొదట్లో ఆర్‌బీఐ ప్రకటించింది. రూ.2.5-5 లక్షల రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తి 80 శాతంగా.. రూ.5 లక్షలకు పైబడ్డ రుణాలకు 75 శాతంగా నిర్ణయించింది. ఈ మార్పులు చేసేందుకు 2026 ఏప్రిల్ 1 వరకు రుణదాతలకు సమయం ఉంది. కొత్త నిబంధనల వల్ల ఆయా రుణాలిచ్చే సంస్థల పోటీతత్వంలో మార్పు రానుందని ఎస్ అండ్ పీ అంటోంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) నష్టనివారణ విధానాలను అభివృద్ధి చేసుకోవాల్సి వస్తుంది. రుణం తీసుకునే వ్యక్తికి, ఆ రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందో లేదో తెలుసుకునే ప్రక్రియలనూ సంస్థలు అభివృద్ధి చేసుకోవాల్సి వస్తుంది. 'సాధారణంగా తాకట్టు పెట్టిన పసిడి విలువపైనే వాళ్లు ఆధారపడుతుంటారు.

# కెసిఆర్ లేకుండా నల్గొండ లిల్లీపుట్ ఎవరు?





పెద్దగా ఉన్న నాయకుడికి అర్థం కావల్సింది ఏంటంటే అక్కడ ఏం జరుగుతుందో కూడా తనకు సమాచారం వస్తనే ఉంటదని చెప్పారు. ఆయన ఎవరిని ఏ టైంలో కలిసారు తరపై వ్యాఖ్యలు చేయటానికి ఎవరిని ప్రోత్సహించారు. ఆయన ఎంత కింద స్థాయికి దిగజారి ఒక ఆడబిడ్డ మీద అటువంటి వ్యాఖ్యలు చేయించారో తాను గమనిస్తున్నానని పేర్కొన్నారు. తాను బలంగా కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతున్నా. ఇప్పుడు తనను ఏదో ఒంటరి చేసి తన మీద ఇటువంటి వ్యాఖ్యలు చేయించి శునకానందం పొందొచ్చు అని, కచ్చితంగా అది తిరిగి కొట్టే సమయం వస్తదని చెప్పారు. తాను భయపడే వ్యక్తిని కాదు అని, తెలంగాణ కోసమే కొట్లాడానని అన్నారు.

### కాంగ్రెస్, బిజెపి పార్టీల నాటకాలు

బిసి రిజర్వేషన్ల సాధన కోసం సోమవారం నుంచి ఇందిరాపార్క్ వద్ద 72 గంటల దీక్ష చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి అడిగితే స్పందన లేదని ఎంఎల్‌సి కవిత అన్నారు. బిసి బిల్లు అంశంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు నాటకాలాడుతున్నాయని ఆమె విమర్శించారు. రాష్ట్రపతి దగ్గరున్న బిల్లు విషయంలో సిఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. సోమవారం తలపెట్టే ధర్నాకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోతే తన నివాసం నుంచైనా దీక్ష కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. గాంధేయ మార్గంలో అన్నం తినకుండా, నీళ్లు తాగకుండా 72 గంటలు దీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బిజెపి కలిసి నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు ఎవరూ బిసి రిజర్వేషన్ల గురించి మాట్లాడట్లేదని తెలిపారు.

### కెసిఆర్ శత్రువుల వ్యాఖ్యలను కవిత వల్లె వేశారు : జగదీష్‌రెడ్డి

కెసిఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వాళ్లు, బిఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్న వారు ఏం మాట్లాడుతున్నారో.. కవిత అదే మాట్లాడుతున్నారని విమర్శించారు. కెసిఆర్ శత్రువులు ఉపయోగించిన పదాలను కవిత వల్లె వేస్తున్నారని ఆక్షేపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు అంటూ ఎద్దేవా చేశారు. నల్గొండ జిల్లాలో 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలు, గెలుపునకు తాను బాధ్యుడను అయితే ఓటమికి కూడా తానే బాధ్యును అని పేర్కొన్నారు. పార్టీ అంతిమంగా ఫైనల్ అని, తాను పార్టీకి సైనికుడిని అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యక్తులుగా ఏదో చేస్తామని అంటే వారి భ్రమ అని ఎద్దేవా చేశారు. కొంతమంది ఏదో చేయాలని ఊహించుకుంటున్నారని విమర్శించారు. తాను కెసిఆర్‌ను ఈ మధ్య కాలంలో తాను 50సార్లు కలిశానని, కెసిఆర్‌తో బనకచర్ల, కాళేశ్వరం నీళ్లు, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపైనే చర్చించామని స్పష్టత ఇచ్చారు. కెసిఆర్ జరిగిన సమావేశంలో నిమిషం సమయం కూడా కవిత గురించి చర్చించలేదని తాను చెప్పానని పేర్కొన్నారు. కెసిఆర్ లేకపోతే ఎవరూ లేరని, అందులో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. తాను చావు తప్పి కన్నులొట్ట బోయినట్లు ఎంఎల్ఏగా గెలిచానని.. కానీ కొంతమంది గెలవలేదు కదా..? అని ప్రశ్నించారు. కవితపై ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని చెప్పారు. తన దృష్టికి వచ్చి ఉంటే స్పందించేవాడినని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఈ జిల్లాల్లో గట్టి వానలు

### ఉపరితల ఆవర్తనంతో రెండ్రోజులు వర్షాలు

### దక్షిణ కోస్తా, రాయలసీమ, తెలంగాణకు వర్ష సూచన

### ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



విశాఖపట్నం: ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపరితల ఆవర్తనం కాస్త ఉపశమనం కలిగించనుంది. ఉత్తర తమిళనాడు, నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 1.5 నుంచి 4.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై కనిపించనుంది. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలి కపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉంది. అదేవిధంగా.. ఉత్తరాంధ్రులో మాత్రం ఒకట్రెండుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుంటాయి. తీరం వెంబడి 40 నుంచి 50 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అల్పపీడనం కారణంగా తెలంగాణలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నేడు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలు ఉరుములు, మెరుపులతో కూడి ఉంటాయని, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలపై ఈ వాయుగుండం ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు వివరించారు. ఆగస్టు 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గత 24 గంటల్లో నారాయణపేట జిల్లాలోని మాగనూరులో అత్యధికంగా 3.13 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో 2.74 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇక ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఉత్తర భారతదేశం వైపు ఎక్కువగా కేంద్రీకృతం కావడంతో ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురిశాయి. నైరుతి గాలులు పొడిబారిపోవడం కూడా వర్షాలు తగ్గడానికి ఒక ముఖ్య కారణంగా నిపుణులు పేర్కొన్నారు.